క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక నగరిగుట్టలోని శ్రీవెంకటేశ్వర ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌లు హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏకలవ్యుడు గొప్ప గురు భక్తి పారాయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చలపతి, ఎరుకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చాతుర్మాస వ్రత దీక్ష

లింగాల : మండలంలోని వెలిదండ్ల దేవరకోనలో ఆదివారం చాతుర్మాస వ్రత దీక్ష ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాగవత భక్త సమాజం మండలి పండితులు, సభ్యులు భాగవతం, భారతం, రామాయణం పఠనం గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్రత దీక్ష నాలుగు నెలలపాటు సాగుతుందని, ప్రతి రోజు నిత్య హోమాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు దత్త రాజ మునీంద్ర, భాగవత భక్త సమాజ మండలి అధ్యక్షుడు వి.నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

నేటి నుంచి మస్తాన్‌స్వామి ఉరుసు

పెండ్లిమర్రి : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మస్తాన్‌స్వామి ఉరుసు ఉత్సవాలు సోమవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం స్వామివారికి ఆలయ ఆవరణలో గుండము, మధ్యాహ్నం గంధము, రాత్రి కి స్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం రెండవ రోజున స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని బెస్తవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

ప్రారంభమైన మొహరం వేడుకలు

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లెలో ఆదివారం మొహరం పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు గ్రామంలో మస్తాన్‌స్వామి పీరుకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరు మొహరం వేడుకల్లో పాల్గొని వేడుకలు నిర్వహిస్తారు. గ్రామంలో ఎస్‌ఐ నారాయణ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : గ్రామపంచాయతీలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు కోరారు. ఆదివారం పాపాఘ్నినదిలో ఉన్న తాగునీటి ఫిల్టర్లను ఆయన పరిశీలించారు. మూడు ఫిల్టర్లలో పూర్తిగా నీరు రాకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. సత్వరం కొత్త ఫిల్టర్లను వేసి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. పుల్లయ్యతోట ప్రాంతంలో తాగునీటి సరఫరా లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి తాగునీటి బోరుకు అదనపు పైపులు బిగించి సమస్యను పరిష్కరించారు.

అదునులో పదును వర్షం కరువాయే

- ఆరుద్ర వచ్చినా సాగని అరక
- నేల రాలని చినుకులు
- పొలాల్లో పడని విత్తనం
- ఎరువులు సిద్ధం చేసుకుని వర్షం కోసం రైతుల ఎదురుచూపు


పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

సింహాద్రిపురం : ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. ఏటా జూన్ నెల ప్రారంభంలోనే వేరుశనగ, ఇతర పంటలు సాగయ్యేవి. ఈ ఏడాది జూలై నెల వచ్చినా అదునులో వర్షం పడలేదు. రెండు రోజులు మురిపించిన తొలకరి వానలు అసలు సమయంలో ముఖం చాటేశాయి. నైరుతి రుతు పవనాలు దోబూచులాడుతున్నాయి. మృగశిర కార్తె కంటే ముందే తొలకరి పలకరించింది. సాదారణంగా జూన్ 1 నుంచి జూలై 15 లోపు విత్తుకు అనుకూలమని, సాగుకు అన్నదాతలు సర్వం సిద్ధం చేసుకుని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు 10 శాతం కూడా సాగు కాలేదు. 9800 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, ఇందులో 8467 హెక్టార్లు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటిదాకా కేవలం 102 హెక్టార్లు మాత్రమే వేరుశనగ, కంది, తదితర పంటలు మొలకెత్తాయి. పొలాల్లో తేమ శాతం లేక అన్నదాతల్లో ఆందోళన కనిపిస్తోంది. ఓ వైపు రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకున్నారు. మరోవైపు రైతు వంతుగా ఎరువులు చల్లడం, దుక్కులు చేయడం పూర్తి చేసుకున్నారు. ఇలాంటి సమయంలో వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఆరుద్రలో అదునులో పదును వర్షం పడితే విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

జూలై 15 వరకు అనుకూలం

ఖరీఫ్ సాగుకు ఇంకా సమయం ఉంది. ఈనెల 15 వరకు పంటలు సాగుచేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని. వర్షం ఎప్పుడు పడినా విత్తుకోవచ్చని చెబుతున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చామన్నారు. ఈ కార్తె నుంచే పదును వర్షాలు కురుస్తాయన్నారు.

వర్షం కోసం ఎదురుచూపు



వేరుశనగ సాగుకోసం పొలంలో దుక్కులు పూర్తి చేశాను. ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్నాను. నిండు వేసవిలో ఆకాల వర్షాలు కురిశాయి. తొలకరి వర్షాలు ముందస్తుగా పలకరించినా. ప్రస్తుతం కారు మబ్బులే కనిపిస్తున్నాయి. చిరుజల్లులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పదునైన వర్షం కురిసిన విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వై.రామశేఖరరెడ్డి, రైతు, సింహాద్రిపురం

ప్రాజెక్టు లేకుంటే ఆత్మహత్య



దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముందు చూపుతో రైతులకు సాగునీటి కష్టాలు ఉండకూడదని తలంపుతో పైడిపాలెం ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎంత కరువు వచ్చినా చీనీ పంటను కాపాడుకుంటున్నాం. దీంతో రైతుల ఆత్మహత్యలు తప్పాయి.

– బాబు రెడ్డి, రైతు, సింహాద్రిపురం

ఆందోళన చెందాల్సిన పనిలేదు



ఖరీఫ్ సాగు ఇంకా ఆరంభం మాత్రమే. జూలై 15 వరకు విత్తనానికి అనుకూలం. రైతులు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. అరకొర తేమకు విత్తుకోవడం మంచిది కాదు. పదునైన తేమలోనే విత్తనం నాటుకోవాలి. ఇప్పటికే మొలకెత్తిన పైరుకు చిరుజల్లులతో ఉపశమనం కలుగుతోంది. ఆరుద్ర కార్తె రావడంతో కారు మబ్బులు కమ్ముకొస్తున్నాయి. వర్షం పడే అవకాశం ఉంది. వేరుశనగలో అంతర పంటగా కంది. ఆముదం వేసుకోవాలి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కళ్యాణ్, మండల వ్యవసాయాధికారి, సింహాద్రిపురం

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం


పూజలందుకుంటున్న మోక్ష నారాయణ స్వామి

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితుల ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి నెల ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా హరిహరాదులను దర్శించుకునే ఆలయం ఇదొక్కటే కావడంతో భక్తులు విరివిరిగా తరలి వచ్చారు. ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానాల్లో భాగంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వార్లను మాడ వీధుల గుండా గరుడ సేవ చేశారు. అలాగే రథంపై స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్


బాబు జగ్జీవన్‌రాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే(వైఎస్ రాజారెడ్డి భవన్) కార్యాలయంలో బాబు జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా జగ్జీవన్ రాం చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రాం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, గండి రాము, కాంతమ్మ, ఖాదర్ బాషా, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని స్థానిక శ్రీరాజా కళానిలయంలో ఆదివారం బాబు జగజ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో బాబు జగజ్జీవన్ రాం చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, డ్యాన్స్ మాస్టర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం


మానవత స్వచ్ఛంద సంస్థ నూతన అధ్యక్షుడు యోగేశ్వర్‌బాబును సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

వేంపల్లె : మండల నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించినట్లు ఆ స్వచ్ఛంద సంస్థ మండల శాఖ చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులుగా డాక్టర్ యోగేశ్వర బాబు, ఉపాధ్యక్షులుగా తేజ, కార్యదర్శిగా చైతన్య, కోశాధికారిగా సుభాష్‌లతోపాటు తదితర విభాగాల కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. సలహాదారుల బోర్డు సభ్యులుగా డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారామ్, రవి డాన్స్ అకాడమీ ప్రతినిధి ప్రసాద్, తిరుమల రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి కావలికృష్ణతేజ, రీజనల్ చైర్మన్ చెల్లా బాలాజీ, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీవిద్యాధరి పాఠశాలలో ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు విధానాలు, రెండు జెండాలు ఉండకూడదని నినదించిన దార్శనిక నేత శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు


పులివెందుల : శ్రీలక్ష్మీభూదేవి సమేత శ్రీసత్యనారాయణస్వామి


వేంపల్లెలో ప్రత్యేక అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి


పులివెందుల : ప్రత్యేక అలంకరణలో శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్ : ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కృష్ణ రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కాయకర్పూరాలను సమర్పించారు. అలాగే పద్మావతి సమేత కల్యాణ వేంకటరమణుడి ఆలయంలో ఆలయ అర్చకులు వరదాచార్యులు విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని, కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. జూటూరు నాగసుగుణాకర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పురోహితులు రుద్రమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ఈఓ హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం తొలి ఏకాదశి పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వర స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, నివేదన, మహా మంగళ హారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వెండి శంకు చక్రాలు, కిరీటంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని ప్రముఖ శ్రీలక్ష్మీచెన్నకేశవ ఆలయంలో, ముద్దనూరులోని శ్రీచెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. చెన్నకేశవ విగ్రహ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కన్యతీర్థంలో ఆషాడమాస తొలి ఏకాదశిని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీకాలు వేయించాలి


జంతువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

జమ్మలమడుగు : పెంపుడు జంతువులకు యజమానులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డైరక్టర్ డాక్టర్ ఆర్. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జంతువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. యాజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తిరుమలకు పాదయాత్ర

కమలాపురం : పెద్దచెప్పలి నుంచి దాదాపు 300 మంది వెంకన్న భక్తులు తిరుమలకు పాదయాత్రకు బయలుదేరారు. ఈ యాత్ర పెద్దచెప్పలిలోని హేలాంబ ఆలయం నంచి బయలు దేరింది. వరుసగా 10వ సారి ఈ పాదయాత్ర జరుగుతుండటంతో టీడీపీ నాయకుడు పుత్తా నరసింహారెడ్డి ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ఈ యాత్ర మొదటి రోజు పెద్దచెప్పలి, కమలాపురం మీదుగా కడప శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన బస కేంద్రానికి చేరుకుంటుంది. రెండో రోజు భాకరాపేట, ఒంటిమిట్ట మీదుగా నందలూరుకు, మూడో రోజు రాజంపేట మీదుగా రైల్వే కోడూరుకు, నాల్గవ రోజు కుక్కలదొడ్డి ప్రాంతానికి చేరుకుంటుందని, చివరి రోజు అక్కడి నుంచి అన్నమయ్య కాలిబాట ద్వారా తిరుమలకు చేరుకుంటామని నిర్వాహకులు తెలిపారు. కాగా పాదయాత్ర జరిగే ఐదు రోజుల పాటు భక్తులకు దారి పొడవునా ఆహార పదార్థాలు, మంచినీరు, వసతి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు చేరి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించడానికి ప్రతి ఏటా వెంకన్న వద్దకు పాదయాత్ర చేస్తున్నామని భక్తులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు


వేంపల్లె : చింతలమడుగుపల్లెలో పీర్ల ఊరేగింపులో భక్తులు


ముద్దనూరులో ఊరేగింపుగా తరలివెళ్తున్న పీర్లు

కమలాపురం : పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లె, సి.గోపులాపురం, విభరాపురం తదితర గ్రామాలలో మొహర్రం పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారు జామున పీర్లను భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని కుళాయిస్వామి దర్గా, బీడీ కాలనీ, అప్పాయపల్లె, సి.గోపులాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, విభరాపురం తదితర గ్రామాలలో వెలసిన పీర్ల మకాన్లు, దర్గాలలో పీర్లు కొలువు దీరారు. మొహర్రం పండుగను పురస్కరించుకుని ఇమాం హసేన్, ఇమాం హుసేన్‌తో పాటు పలు పీర్లను గ్రామాల్లో వైభవంగా ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కాగా అప్పాయపల్లె, సి.గోపులాపురం, విభరాపురం గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జామున పీర్లను వైభవంగా ఊరేగించారు. ఊరేగింపు అనంతరం అన్నదానం నిర్వహించారు. కమలాపురంలోని కుళాయి దర్గాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారు జామున వరకు పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందు ముస్లింలు కలసి చేసుకునే పండుగల్లో మొహర్రం ఒకటి.

ఘనంగా గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల ఉత్సవం

పులివెందుల టౌన్ : స్థానిక నగరిగుట్టలోని గూగూడు కుళ్లాయిస్వామి పీరు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న ఆహ్వానం మేరకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. వారిని సత్కరించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో పీర్లను ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అక్కడి నుండి నగరిగుట్ట, గోపీవిహార్ వీధి, పార్నపల్లె రోడ్డు, బైపాస్ రోడ్డు, మెయిన్ బజార్ మీదుగా డప్పు వాయిద్యాల నడుమ పీర్ల ఉత్సవం నిర్వహించారు. భక్తులు తమ ఇంటివద్దకు రాగానే వెండి గొడుగులను చేయించి పీర్లకు అలంకరించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సింహాద్రిపురంలో గురిజాలలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

ముద్దనూరులో..

ముద్దనూరు : వారం రోజులనుంచి చావిడిలో కొలువుదీరిన పీర్లను ఆదివారం పాతవీధి గుండా ఊరేగించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురం, గురిజాల, బలపనూరు, తెలికి, రావులకొలను గ్రామాల్లో పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. అలాగే పీర్ల చావిడిల వద్ద పానకాలు నిర్వహించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : చింతలమడుగుపల్లెలో ఆదివారం పీర్ల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి పీర్ల చావిడిలో ఇమామ్, హుస్సేన్ పీర్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న వారందరూ కలసికట్టుగా పీర్ల ఉత్సవంలో పాల్గొని రంగులు చల్లుకుంటూ పీర్లను జల్దీకి తీసుకెళ్లారు. సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


గూగూడు కుళాయిస్వామి పీర్లను దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


సి.గోపులాపురంలో కొలువుదీరిన పీర్ల వద్ద ఫాతెహా నిర్వహిస్తున్న భక్తులు